క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎదులాపురం: మరమ్మతుల్లో భాగంగా ఆదివారం భుక్తాపూర్ 33/11 కేవీ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని బద్కామోహల్లా, జీఎస్ఎస్టేట్, తిర్పెల్లీ, చోట తలాబ్, బడా తలాబ్, బ్రాహ్మణవాడ, గాంధీ చౌక్, అంబేద్కర్ చౌక్, శివాజీచౌక్, పంజాబ్ చౌక్, లాండసాంగ్వి, ఎక్స్‌ప్రెస్ ఫీడర్ కన్స్యూమర్స్ ఏరియాల్లో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించాలని కోరారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలో శనివారం మహాలక్ష్మి గ్రామదేవత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలతో హోమం నిర్వహించారు. అనంతరం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయంలో పూజలు

బోథ్ మండల కేంద్రంలోని సాయినగర్‌కాలనీ అభయాంజనేయ ఆలయంలో ఇక ప్రతి నిత్యం పూజలు నిర్వహించనున్నారు. ఈ మేరకు పూజారిని నియమించారు. ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి చొరవతో పూజారిని నియమించడం జరిగిందని సర్పంచ్ సురేందర్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గట్టి గంగాధర్, గోవర్ధన్, ఇస్తారి, గంగమల్లు, రాజేశ్వర్, రమణ, చిన్నయ్య పాల్గొన్నారు.

ఉపాధి గ్రామసభలు

సిరికొండ: మండలంలో జాతీయ ఉపాధిహామీ పథకం 2020–22 సంవత్సరాల ఆడిట్ గ్రామ సభలను ఈనెల 27 నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. 27న లచ్చింపూర్ (బి), నారాయణ్‌పూర్, పోచంపల్లి, కన్నాపూర్ పోన్న, రాంపూర్, కుంటాగూడ, మాల్లాపూర్‌లో 28న వాయిపేట్, జెండగూడ, 30న ఫకీర్ నాయక్ తండా, కొండాపూర్, నేరడిగొండ(జీ), ధర్మసాగర్, సోన్‌పెల్లి, రాయిగూడ, సుంకిడి, రిమ్మ, సిరికొండ గ్రామంలోని పంచాయతీ కార్యాలయాల్లో నిర్వహిస్తామన్నారు.

త్వరలో నాయీబ్రాహ్మణ సేవ సంఘం ఎన్నికలు

ఇచ్చోడ: నాయీబ్రాహ్మణ సేవ సంఘం జిల్లా ఎన్నికలను త్వరలో నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు సింగారపు లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని సేవ సంఘం భవనంలో సభ్యులతో సమావేశం నిర్వహించారు. నూతన జిల్లా కార్యవర్గం ఏకగ్రీవంగా ఏర్పాటు చేసేందుకు తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జెనగామ ప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

నేరడిగొండ: బాధిత కుటుంబానికి వెంకటాపూర్ ఉద్యోగుల సంఘం నాయకులు, గ్రామస్తులు అండగా నిలిచారు. మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ వర్కర్ గోనె మహిపాల్ ఇటీవల అనారోగ్యం మృతి చెందగా.. శనివారం ఆకుటుంబానికి రూ.27,300 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు గంగారాం నాయక్, సర్పంచ్ గోపీచంద్, కారోబారి రూప్లా నాయక్, మాజీ సర్పంచ్ మురళీకృష్ణ, ఉపాధ్యాయులు బాపురావు, మోతిలాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

అవార్డు రావడం గర్వకారణం

ఆదిలాబాద్‌అర్బన్: ఆదిలాబాద్ మున్సిపల్‌కు స్వచ్ఛ మున్సిపల్ అభియాన్ గ్రీన్ సిటీలో భాగంగా మున్సిపల్ ఉత్తమ అవార్డు రావడం గర్వ కారణమని సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్‌ఖాత్రి అన్నారు. శనివారం ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీశ్, గెడం మాధవ్, పడకంటి సూర్యకాంత్, లోలపు శ్రీనివాస్, మాదస్తు సంతోశ్, పొట్టిపెల్లి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

సోయాబీన్ మినీ కిట్స్ పంపిణీ



సోయాబీన్ మినీ కిట్ అందజేస్తున్న అధికారి

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని కచికంటి గ్రామంలో శనివారం పలువురు రైతులకు జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య డీఎస్‌బీ 21 రకం సోయాబీన్ 8 కిలోల మినీ కిట్స్‌ను పంపిణీ చేశారు. వర్షాలు కురిసిన తర్వాతనే రైతులు విత్తనాలు విత్తుకోవాలన్నారు. వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో డీఎవో శివకుమార్, మండల వ్యవసాయాధికారి అష్రఫ్, ఏఈవో నరేశ్, శ్రీనివాస్, రవీందర్ పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీతో ఆర్థికాభివృద్ధి

- ప్రతీ మహిళను సభ్యురాలిగా చేర్చాలని ప్రభుత్వం ఆదేశాలు
- కసరత్తు చేస్తున్న మెప్మా సిబ్బంది

స్వయం సహాయక సంఘాల వివరాలు..

మొత్తం స్వయం సహాయక సంఘాలు	2410
సభ్యుల సంఖ్య	23,985
కొత్త సంఘాల ఏర్పాటు లక్ష్యం	43
ఇప్పటి వరకు ఏర్పాటు చేసిన సంఘాలు	05



సమావేశమైన మహిళలు

కైలాస్‌నగర్: ప్రతీ మహిళ స్వయం సహాయక సంఘంలో (ఎస్‌హెచ్‌జీ)లో సభ్యురాలిగా చేరి ఆర్థికాభివృద్ధి సాధించాలనేదే ప్రభుత్వ లక్ష్యం. ఇందులో భాగంగా ఎస్‌హెచ్‌జీ సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించేలా బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి రుణాల ద్వారా రుణ సదుపాయం కల్పించడంతో పాటు వారు వ్యాపారస్తులుగా మారేందుకు తోడ్పాటునందిస్తోంది. ఇప్పటికే చాలా మంది మహిళలు సభ్యులుగా ఉండి ప్రభుత్వ అందించే ఆర్థిక ప్రయోజనాలు పొందుతూ.. ముందడుగు వేస్తున్నారు. కొత్త వారిని కూడా ఎస్‌హెచ్‌జీ గ్రూపుల్లో భాగస్వామ్యులను చేసి మరిన్ని స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈమేరకు ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో మెప్మా సిబ్బంది కసరత్తు ప్రారంభించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి 43 సంఘాల ఏర్పాటు లక్ష్యం కాగా ఇప్పటికే ఐదు సంఘాలను ఏర్పాటు చేసి లక్ష్యం సాధన దిశగా ముందుకు సాగుతున్నారు.

అవగాహన లేక..

ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో సంఘంలో కొత్తగా చేరేందుకు మహిళలకు అర్హత ఉన్నా.. కొత్త సంఘాల ఏర్పాటు గురించి తెలియక, అధికారులు సైతం అవగాహన కల్పించక ముందుకు రావడం లేదు. పట్టణంలో మహిళల సంఖ్య ఎక్కువగా ఉంటున్నా.. సభ్యులుగా చేరేవారు తక్కువగా ఉంటుందన్నారు. ఫలితంగా కొత్త సంఘాలు ఏర్పాటు కాలేకపోతున్నాయి. సభ్యత్వం లేనందున ప్రభుత్వం అందించే ఆర్థిక ప్రయోజనాలను పొందలేకపోతున్నారు. దీంతో పాటు పొదుపుకు కూడా దూరమవుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పొదుపు చేయడం ఎంతో కీలకంగా మారింది.

కసరత్తు చేస్తున్న మెప్మా సిబ్బంది

2023– 24 ఆర్థిక సంవత్సరానికి ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో 43 కొత్త సంఘాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆదిశగా మెప్మా సిబ్బంది దృష్టి సారించారు. మున్సిపల్ పరిధిలోని 49 వార్డుల్లో చిరు వ్యాపారాలు, దుకాణాలు నిర్వహించే వారిని గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. మహిళా సంఘాల అవశ్యకత గురించి అవగాహన కల్పిస్తూ.. కొత్తగా సంఘాలను ఏర్పాటు చేస్తున్నారు. 18 ఏళ్ల వయస్సు నిండిన మహిళలకు తొలి ప్రాధాన్యతనిస్తు లక్ష్యం సాధన దిశగా ముందుకు సాగుతున్నట్లుగా మెప్మా డీఎంసీ శ్రీనివాస్ తెలిపారు. అర్హులైన మహిళలు సీసీలను సంప్రదించి వివరాలను అందజేయాలనమ్నారు. నిర్దిష్ట గడువులో తమకిచ్చిన లక్ష్యాలను సాధిస్తామని పేర్కొన్నారు.

‘బీఆర్ఎస్ వైఫల్యాలను వివరించాలి’



ఇచ్చోడ: విద్యానగర్‌కాలనీలో



తాంసి: ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు



గుడిహత్నూర్: ప్రచారం చేస్తున్న నాయకులు

తాంసి: బీజేపీ కార్యకర్తలు బీఆర్ఎస్ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సామ సంతోశ్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీజేపీ గడప గడపకూ ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. నిరుద్యోగ భృతి, రుణమాఫీ చేయడపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు విలాస్, నర్సారెడ్డి, కిషన్, అశోక్, రాందాస్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలోని విద్యానగర్ కాలనీ బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లురి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో తొమ్మిదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. రానున్న రోజుల్లో బీజేపీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మడి భీంరెడ్డి, కదం బాబారావు, మండల అధ్యక్షుడు కేంద్రే నారాయణ, పెరమళ్ల పోశెట్టి పాల్గొన్నారు.

దేశం అభివృద్ధి పథంలో నడుస్తోంది

నేరడిగొండ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నడుస్తోందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడే మానాజీ అన్నారు. శనివారం మండలంలోని లింగట్ల, బండగూడ, కొరటికల్ పోలింగ్ బూత్‌లలో గడప గడపకూ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గడిచిన తొమ్మిదేళ్లలో దేశం సూపర్ పవర్‌గా ఎదిగిందన్నారు. రైతులకు అండగా ఉంటూ.. ఫసల్ బీమా యోజన పథకాన్ని తీసుకువస్తే రాష్ట్ర ప్రభుత్వం దాన్ని అమలు చేయకుండా రైతులకు నిండా ముంచిందన్నారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి మాధవరావు ఆమ్టే, మండల అధ్యక్షుడు సోనయ్య హీరాసింగ్, సుభాష్, అనిల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

గుడిహత్నూర్: తెలంగాణ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ అన్నారు. గడప గడపకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని మన్నూర్, కొల్హారి గ్రామంలో ఇంటింటి కీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. గడిచిన 9 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం ఎలాంటి అవినీతికి తావులేకుండా అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. అవినీతి, కుటుంబ పాలన నుంచి విముక్తి పొందేందుకు బీఆర్ఎస్‌ను ఓడించాలన్నారు. జెడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్, ఎంపీపీ భరత్, నాయకులు లక్ష్మణ్, భూమా పటేల్, జగన్, సుధాకర్, పరమేశ్వర్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని మంత్రికి వినతి

బోథ్: మండలంలోని పరుపులపల్లె గ్రామస్తులు శనివారం నిర్మల్ దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిని కలిశారు. గ్రామంలో హనుమాన్ ఆలయ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈసందర్భంగా మంత్రిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ మారుతి, న్యాయవాది శంకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరామర్శ

బోథ్: మండలంలోని పొచ్చర గ్రామానికి చెందిన యాల్ల భీంరెడ్డి అనే రైతు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. ఆయన వెంట నల్ల నారాయణ రెడ్డి, వెంకట్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, బత్తుల రాము, బిట్లింగ్ ముత్యం, వంశీరెడ్డి ఉన్నారు.

- మహారాష్ట్రలోని మలక్‌జాం వద్ద గోరక్షక్ కార్యకర్తలపై ఈనెల 22న జరిగిన దాడిలో ఒకరు మృతి చెందగా, మరికొంత మందికి గాయాలయ్యాయి. కాగా బోథ్‌కు చెందిన భజరంగ్‌దళ్, వీహెచ్‌పీ నా యకులు శివిని, కంచిలి వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం నాందేడ్ జిల్లా పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీహెచ్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి దశరథ్ పటేల్, భజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ పాలిక్ రమేశ్, పట్టణ కన్వీనర్ నిఖిల్ గంగాజీ, మాసం అనిల్ కుమార్ పాల్గొన్నారు.

సన్మానం

బోథ్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన ధన్నూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేశ్ వైద్యని శనివారం బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. జెడ్పీటీసీ సంధ్యారాణి, బోథ్ సర్పంచ్ సురేందర్ యాదవ్, తాహేర్ బిన్ సలాం, నారాయణ రెడ్డి, ఎల్క రాజు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన మమ్మద్ అక్బర్, జనరల్ సెక్రటరీ పట్వాన్ సర్దార్ సింగ్‌లను నేతకానీ మహర్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, దుర్గంట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్ ఘనంగా సన్మానించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ట్రస్ట్ కార్యాలయంలో శుభాకాంక్షలు తెలిపారు.

కేసీఆర్ పాలనలో రాష్ట్రం అప్పులపాలు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్



కేంద్ర పథకాలను వివరిస్తున్న పాయల్ శంకర్

ఆదిలాబాద్: సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం అప్పుల పాలైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో శనివారం పర్యటించారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందని, బీజేపీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. ఎమ్మెల్యే జోగు రామన్నకు ప్రతీ అభివృద్ధి పనిలో కమీషన్ తీసుకుంటున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ నిధులు దారిమళ్లుతున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో భీంసేన్‌రెడ్డి, స్వామి, ధోని జ్యోతి, ముకుందరావు, శివ, గోపి, రాజు పాల్గొన్నారు.

కేసీఆర్ మాయలో పడొద్దు..

జైనథ్: ఎన్నికల ముందు జిమ్మిక్కులు చేసే కేసీఆర్ మాయలో మరోసారి పడొద్దని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. శనివారం మండలంలోని లేకర్‌వాడలో పర్యటించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించి, రుణాల పేరిట ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. వ్యవసాయ పనిముట్లు, విత్తనాలపై సబ్సిడీ ఎత్తివేసి రైతుల ఉసురు తీస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కట్కం రాందాస్, బింగి వెంకన్న, రమేశ్, చిల్కూరి జ్యోతి, ముకుంద్ రావ్, కరుణాకర్ రెడి, లింగన్న, రాకేశ్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో పాల్గొనండి



అవగాహన కల్పిస్తున్న సాయిచరణ్ గౌడ్

ఆదిలాబాద్‌అర్బన్: రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీలను జిల్లా యువత సద్వినియోగం చేసుకోవాలని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్ గౌడ్ అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని పిట్టలవాడలో ఆన్‌లైన్ క్విజ్ పోటీల గురించి స్థానిక యువతకు వివరించారు. జూలై 2న జరగబోయే పోటీల్లో అందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సెల్ కార్యదర్శి ఇలియాస్ ఖాన్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తహెర్ ఖాన్, భూపెల్లి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: రాజీవ్‌గాంధీ క్విజ్ పోటీలపై ఉట్నూర్ పులాజీ బాబా కళాశాలలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ భొజ్జు పటేల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. జూలై 1 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాని, 2న క్విజ్ ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో సయ్యద్‌నిసార్, సునీల్, మెస్రం నగేశ్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

- మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న జోగు ప్రేమేందర్

కైలాస్‌నగర్: పట్టణంలోని విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని అబ్దుల్లా చౌక్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్‌శాఖ ఎస్ఈ సంపత్ కుమార్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డులో నెలకొన్న సమస్యను పరిష్కరించేందుకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యుత్ వినియోగానికి తగినట్లు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, తదితరులు పాల్గొన్నారు.

‘ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిని బర్తరఫ్ చేయాలి’



ఆందోళన చేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ముదిరాజ్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిని బర్తరఫ్ చేయాలని ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు శివయ్య డిమాండ్ చేశారు. శనివారం అమరవీరు స్తూపం వద్ద మహాసభ ఆధ్వర్యంలో కౌశిక్‌రెడ్డి ఫ్లెక్సీని దహనం చేశారు. ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్రంలో పెద్ద సామాజికవర్గం అయిన ముదిరాజ్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు నర్సింగ్, సత్యనారాయణ, ఆశన్న పాల్గొన్నారు.

నేరడిగొండ: ముదిరాజ్ కులస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డిను వెంటనే బర్తరఫ్ చేయాలని ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మందుల రమేశ్ డిమాండ్ చేశారు. ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని శనివారం కుమారి గ్రామంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో కుమారి వీడీసీ చైర్మన్ శంకర్, ముదిరాజ్‌లు సుంకరి రాములు, గోండ్ల కిష్టయ్య, హరీశ్, రాము, దేవేందర్, లింగన్న, గంగాధర్, మధు, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ నాల్గో శనివారం ‘నో బ్యాగ్ డే’



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బోథ్: ఈఏడాది నుంచి ప్రభుత్వం ప్రతీ నాల్గో శనివారం పాఠశాలలో నో బ్యాగ్ డే అమలు చేస్తోంది. దీంతో శనివారం ఆయా పాఠశాలల్లోని విద్యార్థులకు ఆటలు, పాటలు, క్విజ్ పోటీలు, ఇతరత్రా కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో శనివారం విద్యార్థులు చిత్రలేఖనం, డ్యాన్స్, పాటలు పాడించారు. వారం చివర్లో విద్యార్థులు ఉల్లాసంగా గడిపేందుకు నో బ్యాగ్ డే దోహదపడుతుందని ప్రిన్సిపాల్ ఉమేష రావు తెలిపారు.

తలమడుగు: తెలంగాణ ప్రభుత్వము నూతన విద్యా సంవత్సరంలో ప్రతీ నాల్గో శనివారం నో బ్యాగ్ డే జరుపుకోవాలని నిర్ణయించింది. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. లైబ్రరీని సందర్శించి మైదానంలో ఆటలు ఆడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వినోద్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘ప్రజలను మోసం చేస్తున్న కేసీఆర్’



మహిళలతో మాట్లాడుతున్న కంది శ్రీనివాస్‌రెడ్డి

బేల: సీఎం కేసీఆర్ ఉచిత హామీలతో ప్రజలను మోసం చేస్తున్నాడని కాంగ్రెస్ జిల్లా నాయకులు కంది శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. శనివారం మండలంలోని బెదోడ, కాంఫుర్‌పూర్, మణియార్‌పూర్, దహెగాం గ్రామాల్లో పర్యటించారు. కాంగ్రెస్ అధికారంలో రాగానే ఏకకాలంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తుందన్నారు. అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్‌లు ఇద్దరు ఒకటేనని మండిపడ్డారు. భూ కబ్జాలు, అన్నిదందాలు కలిసే చేస్తారని ఆరోపించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్, వాంఖడే వామన్, ఠాక్రే అశోక్, దేవ్‌తాళే విఠల్, బొక్రే శంకర్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: కాంగ్రెస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఏఐసీసీ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ కోఆర్డినేటర్ వినోద్ నాయక్ అన్నారు. శనివారం మండలంలోని వడగామ్ గ్రామంలో నిర్వహించిన చేరికల కార్యక్రమానికి హాజరయ్యారు. పలువురికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సోమోరే నాగోరావ్, ముఖడే ఉత్తం, కల్యాణ్, భావ్‌రాజ్, విజయ్, గోపాల్ పాల్గొన్నారు.

ఏకకాలంలో రుణమాఫీ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సాజిద్ ఖాన్

జైనథ్: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ అన్నారు. శనివారం మండలంలోని మేడిగూడలో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వరంగల్ రైతు డిక్లరేషన్, కాంగ్రెస్ అమలు చేసే పథకాల గురించి ప్రజలకు వివరించారు. రూ. 15వేల రైతుబంధు, రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తామన్నారు. 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, యువతకు రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి రాంచంద్రరెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, ఏఎంసీ మాజీ చైర్మన్లు సంజీవ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతోమెలగాలి

ఆదిలాబాద్‌రూరల్: నేరస్తులు నేరాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో మెలగాలని ఆదిలాబాద్ రూరల్ సీఐ సైదారావ్ సూచించారు. శనివారం ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో పాత నేరస్తులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై నాగనాథ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

జైనథ్: మండలంలోని ఆనంద్‌పూర్ గ్రామంలో పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్‌రెడ్డి పంపిణీ చేశారు. నిరుపేదలను ఆదుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం చెక్కులు పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయినాథ్, పోతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

షాదీముబారక్ చెక్కులు మంజూరు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న సద్దాం

నేరడిగొండ: షాదీ ముబారక్ చెక్కులను త్వరగా మంజూరు చేయాలని లీడ్స్ వెల్ఫేర్ సొసైటీ నేరడిగొండ సభ్యులు ఎండీ సద్దాం అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఆర్డీవో రమేశ్ రాథోడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఇప్పటికీ డబ్బులు అందలేదన్నారు. కార్యక్రమంలో సభ్యులు సయ్యద్ సాబీర్, షేక్ అర్షద్, మొహమ్మద్ అఖిల్, సయ్యద్ ఖైస్ పాల్గొన్నారు.

అధ్వానంగా డ్రెయినేజీలు



తలమడుగు: మండలంలోని రుయ్యాడి గ్రామంలో డ్రెయినేజీలు పూడికతతో నిండి అధ్వానంగా మారాయి. దీంతో ఈగలు, దోమలు వృద్ధి చెంది వ్యాధులు వ్యాపిస్తాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ సిబ్బంది స్పందించి డ్రెయినేజీలు శుభ్రం చేయాలని కోరుతున్నారు.